

రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

పరిహారం ఇచ్చిన భూములకే ఫెన్సింగ్

» అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

యాచారం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి పరిహారం, ప్లాట్లు పొందిన రైతుల భూములకు మాత్రమే ఫెన్సింగ్ వేయాలని అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి ఆదేశించారు. గురువారం యాచారం మండలం నానక్‌నగర్‌లో ఫార్మాసిటీ కోసం గతంలో సేకరించిన భూములకు టీజీఐఐసీ, రెవెన్యూ అధికారులు ఫెన్సింగ్ వేశారు. 'మా భూములకు ఫెన్సింగ్ వేయొద్దని.. మాకు పరిహారం అందలేదని' కొందరు రైతులు పనులను అడ్డుకునేందుకు యత్నించారు. కేవలం పరిహారం, ప్లాట్లు పొందిన రైతుల భూములకు మాత్రమే ఫెన్సింగ్ వేస్తామని ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దారు అయ్యప్ప తెలపడంతో శాంతించారు. అలాగే అథారిటీలో ఉన్న భూములకు ఫెన్సింగ్ వేయరాదని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా నానక్‌నగర్‌కు అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి చేరుకొని పనులను పరిశీలించారు. ఫెన్సింగ్ పనులపై ఆయన ఆరా తీశారు. గ్రామంలో ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా అదనపు డీసీపీ సత్యనారాయణ. ఏసీపీ కేపీవీ రాజు, సీఐలు మధు, నందీశ్వర్‌రెడ్డి, ఎస్సైలు సైదులు, వంశీ, నాగేశ్వర్‌రావు, చందర్ సింగ్, నాగరాజు బందోబస్తు ఏర్పాటు చేశారు.



సీఎం రేవంత్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

న్యాయమైన పరిహారం అందించండి

సీఎంకు ఎమ్మెల్యే కసిరెడ్డి వినతి

ఆమనగల్లు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : రీజినల్ రింగ్ రోడ్డులో భాగంగా ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి మండలాల పరిధిలో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు బహిరంగ మార్కెట్ రేటు ప్రకారం పరిహారం అందించాలని సీఎం రేవంత్‌ను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. నిర్వాసితులు అధికంగా సన్న, చిన్నకారు రైతులే ఉన్నారని వివరించినట్లు ఆయన తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో సీఎం నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ట్రిపుల్ ఆర్ నిర్మాణం, కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి, బీటీ రోడ్ల విస్తరణ గురించి చర్చించినట్లు తెలిపారు. భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందిద్దామని సీఎం సూచించినట్లు చెప్పారు.

రాష్ట్రంలో ప్రజాపాలన

ప్రజల ఆకాంక్షలకనుగుణంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పాలన సాగుతుందని ఎమ్మెల్యే కసిరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, కల్వకుర్తి మండలాల్లో గురువారం ఎమ్మెల్యే కసిరెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పలువురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఆనంద్‌కుమార్, భూపతి రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, సంజీవ్‌కుమార్, సురేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్ రావు, శ్రీకాంత్ రెడ్డి ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న 'వనమహోత్సవం' ఉమ్మడి జిల్లాలో నత్తనడకన సాగుతోంది. గత ఏడాది అరకొర లక్ష్యాలు సాధించిన ప్రభుత్వ శాఖలు ఈ ఏడాది కూడా ఈ బృహత్తర కార్యక్రమాన్ని నీరుగారుస్తున్నాయి. ఈ సంవత్సరం వర్షాలు దండిగా కురిసినప్పటికీ రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో వనమహోత్సవ కార్యక్రమంపై అధికార యంత్రాంగం పెద్దగా శ్రద్ధపెట్టలేదు. కొన్ని ప్రభుత్వ శాఖలు ఈ విషయంలో తీవ్ర నిర్లక్ష్యంతో ఉన్నాయి. దీంతో ఈ ఏడాది ఇప్పటివరకు 50శాతం కూడా లక్ష్యాలు చేరుకోలేదు. దీన్ని బట్టి ఈ ఏడాది కూడా 70శాతం కూడా లక్ష్యం చేరే అవకాశం కనిపించడం లేదు.

నిలువెత్తు నిర్లక్ష్యం



నీరుగారుతున్న వనమహోత్సవ లక్ష్యం

నాటాల్సింది 2.08 కోట్లు..
నాటింది 1.01 కోట్లే
ఈ ఏడాది మొక్కలు నాటడంలో వెనుకంజ
ఉమ్మడి జిల్లాలో సగం కూడా దాటని టార్గెట్
అలసత్వం వహిస్తున్న పలు ప్రభుత్వ శాఖలు



రంగారెడ్డి జిల్లాలో ఆయా శాఖల లక్ష్యం- నాటిన మొక్కల సంఖ్య (లక్షల్లో)

శాఖలు	లక్ష్యం	నాటిన మొక్కలు	శాతం
పురపాలక	39.07	19.45	49.78
డీఆర్‌డీవో	33.20	17.62	53.07
అటవీ	6.35	3.81	60.00
వ్యవసాయ	4.22	2.44	57.81
పరిశ్రమల	2.76	1.28	46.37
ఎక్సైజ్	1.49	0.52	34.89
ఉద్యాన	1.41	1.16	82.26
విద్యాశాఖ	0.80	0.83	103.70

జిల్లాల వారీగా వనమహోత్సవం (మొక్కలు లక్షల్లో)

జిల్లా	లక్ష్యం	నాటిన మొక్కలు	శాతం
రంగారెడ్డి	89.32	47.15	52.61
వికారాబాద్	48.38	34.82	71.97
మేడ్చల్	70.60	19.80	28.04

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

వర్షాకాలంలో మొక్కలు నాటి వాటిని పెంచేందుకు కొన్నేళ్లుగా ప్రభుత్వాలు పలు చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఉమ్మడి రాష్ట్రంలో కూడా నగర శివార్లలో విస్తారంగా వనాలను, అటవీ సంపదను పెంచారు. రాష్ట్ర విభజన తరువాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారం పేరుతో ఈ కార్యక్రమం నిర్వహించింది. అయితే తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కార్యక్రమానికి వనమహోత్సవంగా నామకరణం చేసింది. ఇందులో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతీ గ్రామంలోని నర్సరీలు ఏర్పాటు చేసి వాటిల్లో వివిధ రకాల

మిగతా 7వ పేజీలో...

ప్రభుత్వ శాఖల బురిడీ

వనమహోత్సవం కార్యక్రమం విషయంలో పలు ప్రభుత్వ శాఖలు సర్కార్‌ను బురిడీ కొట్టిస్తున్నాయి. ప్రతిఏటా వనమహోత్సవ లక్ష్యాలను తగ్గించుకుంటున్నాయి. తక్కువ లక్ష్యం పెట్టుకుని ఎక్కువ సాధించినట్లు గణాంకాలు చూపుతున్నాయి. ఉదాహరణకు వనమహోత్సవంలో పెద్దఎత్తున విద్యార్థులను భాగస్వాములుగా చేస్తుండడం ఆనవాయితీగా వస్తుంది. ప్రతీ జిల్లాలో విద్యార్థులతో లక్షల్లో మొక్కలు నాటిస్తుంటారు. అయితే విద్యాశాఖ ఈ బాధ్యత నుంచి క్రమంగా తప్పుకుంటున్నట్లు కనిపిస్తోంది. ఉదాహరణకు రంగారెడ్డిజిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా విద్యార్థులు ఉన్నారు. ఒక్కో విద్యార్థితో ఒక్కో మొక్క నాటించినా ఏటా 10లక్షలకుపైగా నాటించవచ్చు. కానీ ఈ ఏడాది విద్యాశాఖ కేవలం 80వేలు మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకుని తాము లక్ష్యం చేరుకున్నట్లుగా చూపిస్తోంది. ఇదిలా ఉంటే మరికొన్ని శాఖలు అసలు కనీస స్థాయిలో కూడా మొక్కలు నాటలేదు.



రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

శాంతిభద్రతలను పరిరక్షించాలి

» సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి

శంకర్‌పల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకు చిత్తశుద్ధితో పనిచేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ఆదేశించారు. శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆయన గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి మాట్లాడారు. కేసుల దర్యాప్తులో వేగం పెంచాలని ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. అయితే సీఐ శ్రీనివాస్ గౌడ్ శంకర్‌పల్లి పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఉందని, సిబ్బందిని పెంచాలని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సీపీ సానుకూలంగా స్పందించారు. అనంతరం శంకర్‌పల్లిలో కొత్తగా నిర్మిస్తున్న పోలీస్‌స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈయన వెంట రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, నార్సింగి ఏసీపీ రమణగౌడ్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సమరంరెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి సుశీంద్రరావు

బోధనోపకరణాలతో మేధాశక్తి పెంపు

» డీఈవో సుశీంద్రరావు

మహేశ్వరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బోధనోపకరణాలతో పాఠాలు చెబితే విద్యార్థుల మేధాశక్తి పెరుగుతుందని డీఈవో సుశీంద్రరావు అన్నారు. గురువారం తుక్కుగూడలోని దేవేంద్ర విద్యాలయంలో జిల్లా టీఎల్ఎం మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనోపకరణాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ బోధనోపకరణాలు తయారు చేసిన 10 పాఠశాలలు రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికకావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు కస్నానాయక్, కృష్ణయ్య, లక్ష్మణ్, చంప్లానాయక్, శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శంషాబాద్‌లో హైడ్రా హల్‌చల్

బురుగుకుంట చెరువు ఎఫ్‌టీఎల్‌లో అక్రమంగా నిర్మించిన గోదాంల కూల్చివేత



శంషాబాద్ బురుగుకుంటలో ఉన్న అక్రమ నిర్మాణాలపై గోదాంలను కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు

శంషాబాద్‌రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అక్రమ నిర్మాణాలపై హైడ్రా అధికారులు ఉక్కు పాదం మోపారు. గురువారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని బురుగుకుంట చెరువు ఎఫ్‌టీఎల్‌లో అక్రమంగా నిర్మించిన గోదాంలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకుండా భారీ గోదాంలను నిర్మించారు. స్థానికుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన హైడ్రా ఎస్సై తిరుమలేష్‌గౌడ్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు మధ్య బురుగుకుంటలో 1500 గజాల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. బురుగుకుంట సమీపంలో ఉన్న మరో కందకట్ల ప్రాజెక్ట్‌లో 500 గజాలు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తుంది. అందులో ఓవర్ హెడ్ ట్యాంకును అక్రమంగా నిర్మించినట్లు గుర్తించిన అధికారులు దానిని కూడా కూల్చివేశారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త అక్రమంగా వెంచర్ చేయగా, అందులో ఉన్న ప్రహరీని కూడా కూల్చివేశారు. శంషాబాద్‌లోని ఔటర్ రింగ్‌రోడ్డు సర్వీస్ రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్నీ కూల్చివేశారు. ఈ సందర్భంగా హైడ్రా ఎస్సై మాట్లాడుతూ... శంషాబాద్ పట్టణం, మండలంలో మరిన్ని చెరువు ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాలు జరిగిన్నట్లు మా దృష్టికి వచ్చాయని, వాటిని త్వరలో కూల్చివేస్తామని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ భూములు, చెరువుల ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడ అక్రమ నిర్మాణం జరిగిన హైడ్రా సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఆయన వెంటా ఇరిగేషన్ ఏఈ మౌనిక, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతో భవిష్యత్‌కు బాటలు

» ఇంటర్మీడియట్ విద్య ఆర్‌జేడీ జయప్రదాబాయి



విద్యార్థులతో మాట్లాడుతున్న జయప్రదాబాయి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చదువులతోపాటు నైపుణ్యం పెంచుకుంటేనే విద్యార్థికి ఉత్తమ భవిష్యత్ ఉంటుందని ఇంటర్మీడియట్ విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ జయప్రదాబాయి అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ గ్రూపు విద్యార్థుల శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థికి ఇంటర్మీడియట్ విద్య ముఖ్యమైందని, చెడు వ్యసనాలకు లోనుకాకుండా క్రమశిక్షణతో చదవాలని సూచించారు. సాంకేతికంగా వస్తున్న మార్పులను గమనిస్తూ ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా జల విద్యుత్ తయారీ నమూనాని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భూపాల్ రాజు, సీనియర్ ఎలక్ట్రికల్ లెక్చరర్ నందూరి శ్రీనివాస్ ఉన్నారు.



పరిసరాలను శుభ్రంగా ఉంచాలి
డీపీవో సురేష్‌మోహన్ 7



తాగునీటి కోసం తంటాలు 7

కూరగాయల సాగుకు ప్రోత్సాహకం

» జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి సురేశ్



రైతులకు కొనుగోలు ఒప్పంద పత్రాలను అందజేస్తున్న సురేశ్

కడ్తాల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కూరగాయల, ఆరుతడి పంటలను సాగు చేస్తే రైతులకు అన్ని విధాలా లాభదాయకమని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి సురేశ్ అన్నారు. రెయిన్‌ఫెడ్ ఏరియా అభివృద్ధి పథకం కింద కూరగాయలు పండించే రైతులకు ప్రభుత్వం రూ.30 వేలు ప్రోత్సాహకం అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. కడ్తాల మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రెయిన్‌ఫీడ్ ఏరియా డెవలప్‌మెంట్ పథకం, ఆయిల్ పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డివిజన్ ఉద్యాన శాఖ అధికారి సౌమ్య అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు జిల్లా అధికారి సురేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కూరగాయల పంటల సాగు, ప్రభుత్వ ప్రోత్సాహం, ఆర్ఏడీ పథకం గురించి అధికారులు రైతులకు వివరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ సాగు చేసిన రైతులకు వాల్యూ ఆయిల్ కంపెనీ కొనుగోలు ఒప్పంద పత్రాలను అందజేశారు. కూరగాయల సాగుపై రైతులు దృష్టి సారించాలని సురేశ్ సూచించారు. ప్రభుత్వం అందించే రాయితీలో కొంత నగదు, కూరగాయల బుట్టలు, వెర్మిబెడ్స్, తేనెటీగ బాక్స్‌లు అందించడం జరుగుతుందని వివరించారు. ఈ పథకం కింద అర్హులైన రైతులు పాడి పశువులు కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ఉద్యాన అధికారి సౌమ్య, వాల్యూ ఆయిల్ కంపెనీ వైస్ చైర్మన్ రామ్మోహన్ రావు, ఏరియా మేనేజర్ ప్రమోద్, హెచ్ఈవోలు కిశోర్, శ్రవణ్, ఏఈవో లు, ఫీల్డ్ ఆఫీసర్లు ఉన్నారు

చిన్నతూండ్ల శ్మశాన వాటికలో బోర్‌డ్రిల్ చేసి వదిలేసిన అధికారులు



చచ్చినా కష్టాలే..!

శ్మశానవాటికల్లో వసతులు నిల్



ముళ్లకంప చెట్లతో నిండిన కుర్మిద్ద శ్మశాన వాటిక

ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు దర్శనం
అంతిమ సంస్కారానికి నీళ్ల కరువు
దిష్టిబొమ్మల్లా సింథటిక్ ట్యాంకులు
నీటి ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన దుస్థితి
పట్టించుకోని పంచాయతీ అధికారులు

యాచారం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మనిషి చచ్చినా కష్టాలు తీరడం లేదు. శ్మశాన వాటికల్లో కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్కో శ్మశాన వాటికను రూ.9లక్షల వ్యయంతో నిర్మించారు. కానీ వాటిల్లో నీటి సౌకర్యం కూడా కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. యాచారం మండలంలోని 24 గ్రామపంచాయతీలలో ఉన్న శ్మశానవాటికల్లో ఏ ఒక్క దానిలోనూ సరైన వసతులు లేవు. చిన్నతూండ్లలో గ్రామానికి కిలోమీటర్నర దూరంలో కట్టించిన శ్మశానవాటికలో నీటివసతి లేక ట్యాంకర్‌ను తెప్పించుకుంటున్నారు. బోర్ డ్రిల్ చేసినా

మిగతా 8వ పేజీలో...

ఇప్పటివరకు బిల్లు రాలేదు



గ్రామంలో శ్మశాన వాటిక నిర్మాణానికి సొంత డబ్బు రూ. 5లక్షలు వెచ్చించిన. ఇంతవరకు బిల్లు రాలేదు. రోజూ అధికారులు చుట్టూ తిరుగుతున్న. అప్పు శ్మశానవాటిక నిర్మిస్తే డబ్బులు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారు మా గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు.

దంతుక పెద్దయ్య, నానక్‌నగర్ మాజీ సర్పంచ్

డీఎం వైఖరిని నిరసిస్తూ బస్సులు బంద్



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రైవేట్ బస్సుల డ్రైవర్లు

పరిగి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పరిగి ఆర్టీసీ డిపోలో గురువారం ప్రైవేట్ బస్సుల సేవలు నిలిచిపోయాయి. డిపోలో ఉన్న 31 బస్సులు ఉండగా నడపలేమని ప్రైవేట్ బస్సుల డ్రైవర్లు నిరసనకు దిగారు. డీఎం వైఖరిని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. సీటింగ్ కేపాసిటీకి మించి ప్రయాణికులను ఎక్కించుకోవాలని డీఎం ఒత్తిడి చేస్తున్నారని డ్రైవర్లు ఆరోపించారు. ఒక్కోసారి బస్సులో 140 మంది ప్రయాణికులు ఉన్నప్పటికీ ఇంకా ఎక్కించుకోవాలని చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిట్టింగ్ కేపాసిటీపై స్పష్టమైన హామీ ఇవ్వడంతోపాటు, తొలగించిన డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక్కసారిగా బస్సులను నిలిపివేయడంతో షాద్‌నగర్, మహబూబ్ నగర్ రూట్లలో వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వందలాది మంది ప్రయాణికులు బస్ స్టేషన్‌లో గంటలతరబడి వేచి ఉన్నారు. అయితే ప్రైవేట్ బస్సుల డ్రైవర్లు తమను సంప్రదించకుండానే బస్సులను నిలిపివేశారని డీఎం సుఖేందర్‌రెడ్డి తెలిపారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా వికారాబాద్, ఇతర డిపోలకు చెందిన బస్సులను నడిపించామని చెప్పారు.

వెదురు ఉత్పత్తులను

ప్రోత్సహించాలి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించి వెదురు ఉత్పత్తులను ప్రోత్సహించాలని ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి అన్నారు. ప్రపంచ వెదురు దినోత్సవాన్ని పురస్కరించుకొని మహేంద్ర (మేధర) సంఘం ఆధ్వర్యంలో గురువారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. మేధరి సంఘం జిల్లా అధ్యక్షుడు ఇందూరి శ్రీనివాస్ మాట్లాడుతూ వెదురు ఉత్పత్తుల వాడకంపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో మేధర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జెర్రీగల శ్రీనివాస్, ఉప్పరిగూడ పీఏసీఎస్ చైర్మన్ ఏదుల్ల పాండురంగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ భూపతిగల్ల మహిపాల్ తదితరులున్నారు.

జీవన్గి జెడ్పీహెచ్‌ఎస్‌కు మహర్దశ

పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు

ఎమ్మెల్యే చొరవతో కొలతలు తీసుకున్న అధికారులు

తొలగనున్న తరగతి గదుల కొరత



కొలతలు తీసుకుంటున్న ఏఈ యశ్వంత్, అధికారులు

బషీరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీవన్గి జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు తరగతి గదుల కొరత తీరనుంది. ఈ మేరకు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి చొరవతో గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో స్థానికుడు, బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి గురువారం పంచాయతీరాజ్ శాఖ ఏఈని పాఠశాలకు పిలిపించి దగ్గరుండి కొలతలు తీయించారు. ఇక్కడి పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 102 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి సరిపోను గదులు లేక రెండు తరగతులకు వరండాలో బోధిస్తున్నారు. మరికొన్ని తరగతి గదులు శిథిలావస్థకు చేరడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. ఈ క్రమంలో ఏఎంసీ చైర్మన్‌తోపాటు ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను ఇటీవల కలిసి తరగతి గదుల కొరతపై విన్నవించారు. దీంతో ఎమ్మెల్యే తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు అధికారులు కొలతలు తీసుకున్నారు. పురాతన తరగతి గదులను కూల్చేసి భవనం నిర్మించాల్సి ఉండటంతో ఖర్చుపై అంచనాలు తయారు చేస్తామని ఏఈ వెల్లడించారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

తక్షణమే సీఎంఆర్ అందజేయాలి

వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వచ్చే యాసంగికి సంబంధించి బకాయిలో ఉన్న కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను మిల్లర్లు తక్షణమే అందజేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. గురువారం తన చాంబర్‌లో నిర్వహించిన రైస్ మిల్లర్ల జిల్లా సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ.. బ్యాంకు గ్యారెంటీ లేకుండా ప్యాడీ ఇవ్వడానికి వీలు లేదని, తప్పనిసరిగా బ్యాంకు గ్యారెంటీ ఉండాలన్నారు. ఎఫ్‌సీఐ అధికారులు డెలివరీలకు అనుగుణంగా తగిన సంఖ్యలో గోదాములను ఏర్పాటు చేసి, జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ మోహన్ కృష్ణ, అధికారులు సుదర్శన్, శ్రీనివాస్ గుప్తా, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన అధికారుల సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సర్వే నివేదికను సంబంధిత శాఖల సమన్వయంతో తయారు చేయాలని సూచించారు. జిల్లాలో చిన్న తరహా ఖనిజాలు, ఇసుకకు పర్యావరణ అనుమతి కోసం జిల్లా సర్వే నివేదికను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా మైనింగ్ శాఖ ఏడీ సత్యనారాయణ, ఇరిగేషన్ ఎస్ఈ సీతారాం, ఈఈ పీఆర్ ఉమేష్‌కుమార్, గ్రౌండ్ వాటర్ అధికారి రవి, టీజీఎండీసీ శ్రీకాంత్, ఆర్అండ్‌బీ శ్రీధర్‌రెడ్డి, సీపీఓ వెంకటేశ్వర్లు, సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

కేశంపేట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా ఉంటానని, ఆపత్కాలంలో ప్రజలకు సహాయం అందిస్తానని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ రెడ్డి అన్నారు. గురువారం కేశంపేట మండలంలోని కొత్తపేట, ఇప్పలపల్లి గ్రామాల్లో పర్యటించారు. కొత్తపేట గ్రామానికి చెందిన రమేష్, లక్ష్మమ్మ, ఇప్పలపల్లి గ్రామానికి చెందిన అశ్విత్, అక్షయ్‌లను మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి, నవీన్ కుమార్, తలసాని వెంకట్ రెడ్డి, అంజనేయులు, మాజీ ఎంపీటీసీ మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

సత్తాచాటిన చౌదరిగూడ పాఠశాల

టీఎల్ఎం మేళాలో రెండో బహుమతి



చౌదరిగూడ,సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో నిర్వహించిన టీఎల్ఎం మేళా పోటీల్లో జిల్లేడ్ చౌదరిగూడ మండలానికి రెండో బహుమతి వచ్చింది. గురువారం రంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన టీఎల్ఎం మేళాలో చౌదరిగూడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ప్రదర్శించిన తెలుగు బోధనోపకరణలు జిల్లా స్థాయిలో ఆకట్టుకున్నాయి. డీఈవో సుశీందర్‌రావు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీలామోహన్ నాయక్‌కు రెండో బహుమతి కింద మెమొంటోతోపాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

స్ట్రీట్ ఫుడ్ వెండర్లకు సర్టిఫికెట్ తప్పనిసరి

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులకు ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని మెప్మా ప్రాజెక్టు జిల్లా డైరెక్టర్ విజయలక్ష్మి అన్నారు. గురువారం స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యాపారం సక్రమంగా నిర్వహించుకోవడానికి అన్ని అనుమతులు పొందాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాశ్, టీఎంసీ నరేష్, ఎఫ్ఎస్ఎస్ఏఐ ట్రైనీ శివాని పాల్గొన్నారు.

















ఇంకా కొనసాగుతున్న విచారణ

» అక్రమ రిజిస్ట్రేషన్లపై ఎటూ తేల్చని రిజిస్ట్రేషన్ శాఖ



తాండూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తాండూరు సబ్ రిజిష్టర్ కార్యాలయంలో మే 12వ తేదీ నుంచి 18వ తేదీ మధ్యన జరిగిన సుమారు 220 ప్లాట్ల అక్రమ రిజిస్ట్రేషన్లపై విచారణ ఇంకా కొనసాగుతునే ఉంది. జరిగిన రిజిస్ట్రేషన్లను క్రమబద్ధీకరిస్తారా, లేక చేసిన రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తారా, లేదా భారీ జరిమానాలు విధిస్తారా? అనే విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. దీంతో ప్లాట్ల క్రయవిక్రయాలు నిలిచిపోవడంతోపాటు రిజిస్ట్రేషన్ జరిగినా హక్కు పొందలేకపోతున్నారు. అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారంపై ఇప్పటికే ఇద్దరు అధికారులను సస్పెండ్ వేసి చేతులు దులుపుకున్నారు. అప్పట్లో దీనిపై రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సిరియస్‌గా పరిగణించి సమగ్ర దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్ వెంకటరమణ విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదించారు. తర్వాత కొడంగల్ సబ్ రిజిస్ట్రార్ చేత కూడా విచారణ జరిపించారు. అయితే విచారణ నివేదికల వరకే సరిపోవడం ఆరోపణలకు దారితీస్తోంది. దీంతో ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు కోర్టును ఆశ్రయించగా మరికొంత మంది సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నారు. రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఒక కమిటీ వేసి వెంటనే నిర్ణయం తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

నాలుగు దశాబ్దాలు.. 51 లక్షలకుపైగా సర్జరీలు

» అపోలో ఆస్పత్రుల సంస్థల చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అపోలో ఆస్పత్రి 42వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటుందని, దాదాపు 200 మిలియన్లకు పైగా మందికి వైద్య సేవలు అందించడంతో పాటు 185 దేశాల్లో నమ్మకాన్ని సంపాదించిదని అపోలో ఆస్పత్రుల సంస్థల చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటనను జారీ చేశారు. 1983లో భారతదేశంలో మొట్టమొదటి కార్పొరేట్ ఆసుపత్రిగా ఏర్పడి 19,000కు పైగా కీలకమైన ప్రాంతాలను చేరుకుందని ప్రకటించారు. అపోలో నాలుగు దశాబ్దాల్లో 51 లక్షలకుపైగా శస్త్రచికిత్సలు, 27వేలకు పైగా అవయవ మార్పిడి, 22 వేలకుపైగా రోబోటిక్ సర్జరీలు, మూడు మిలియన్ల నివారణ ఆరోగ్యపు పరీక్షలు, 20 మిలియన్లకుపైగా డయాగ్నస్టిక్ పరీక్షలు పూర్తి చేసినట్లు తెలిపారు. అపోలో 11 లక్షలకుపైగా నిపుణులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. తాము ఆసుపత్రులను మాత్రమే కాకుండా, మానవ వనరులను తీర్చిదిద్దామని ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రీతరెడ్డి పేర్కొన్నారు. దక్షిణాసియాలో మొట్టమొదటి ప్రోటాన్ క్యాన్సర్ సెంటర్, దేశంలో మొట్టమొదటి ఏఐ - ప్రెసిషన్ ఆంకాలజీ సెంటర్, మొట్టమొదటి సైబర్‌నైఫ్ రోబోటిక్ రేడియో సర్జరీ సిస్టమ్ వంటి వాటిలో కీలకంగా ఉందన్నారు. ఏఐ, రోబోటిక్స్, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను చికిత్స చేయడానికి మాత్రమే కాకుండా, దానిని అంచనా వేయడానికి, నివారించడానికి, ఏకీకృతం చేస్తున్నామని జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీత రెడ్డి తెలిపారు.

భూ నిర్వాసితులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న తల్లోజు ఆచారి

కడ్తాల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరుతో రైతుల భూములు లాక్కుంటే సహించేది లేదని ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ యాదవ్ హెచ్చరించారు. విద్యుత్ హైటెన్షన్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చే వరకు భూ నిర్వాసితుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. కడ్తాల మండల కేంద్రంలో బీదర్ నుంచి మహేశ్వరం వరకు చేపడుతున్న 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరుతూ భూ నిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 11వ రోజుకు చేరాయి. దీక్షలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్, క్యామ మహేశ్, మొగిలి చెన్నయ్య, డేరంగుల నాగార్జున, చెన్నమోని కృష్ణ, కార్తీక్‌గౌడ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అబ్బు రమేశ్ పాల్గొని సంఘీబావం ప్రకటించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణ, పెంటారెడ్డి, పర్వత్‌కుమార్, రాములు ఉన్నారు.

నిలువెత్తు నిర్లక్ష్యం

(ఐదో పేజీ తరువాయి)



షాబాద్ మండల పరిధిలోని రేగడిదోస్వాడ నర్సరీ

మొక్కలను పెంచుతున్నారు. ఈ మొక్కలను వర్షాకాలం ఆయా శాఖలకు పంపిణీ చేసి వాటిని నాటిస్తున్నారు. అటవీ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 18 ప్రభుత్వ శాఖల ద్వారా ఈ వనమహోత్సవ కార్యక్రమాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జూలై ఒకటో తేదీ నుంచి వనమహోత్సవ కార్యక్రమం ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా ప్రజలను భాగస్వాములుగా చేసి పెద్దఎత్తున నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నా క్షేత్రస్థాయిలో వీటిని సరిగా అమలు చేయడంలో ఆయా శాఖలు విఫలమవుతున్నాయి. నగర శివార్లలో శరవేగంగా సాగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో విస్తారంగా మొక్కలు పెంచాల్సిన అవసరం ఉందని భావించిన ప్రభుత్వం శివార్లలో విరివిగా మొక్కలు నాటాలని ఆదేశించింది. కానీ ప్రతిఏటా లక్ష్యాల మేర మొక్కలు నాటి పెంచడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది.

ఉమ్మడి జిల్లాలో లక్ష్యం 2.08కోట్లు..

ఈ ఏడాది వనమహోత్సవం కార్యక్రమం కింద మూడు జిల్లాల్లో 2.08కోట్ల మేర మొక్కలు నాటాలని నిర్ణయించగా, ఇప్పటి వరకు కేవలం 1.01 కోట్ల మేర మాత్రమే మొక్కలు నాటారు. నేటికీ గ్రామాల్లో నర్సరీల ద్వారా పెంచిన మొక్కలు సగం కూడా పంపిణీ కాలేదు. నర్సరీల నుంచి వివిధ ప్రభుత్వ సంస్థలకు పంపిణీ చేసిన మొక్కలు ఆయా శాఖల వద్ద లక్షల్లో ఇంకా నాటకుండా అలాగే ఉన్నాయి. ఆయా నర్సరీల నుంచి ఇలా తీసుకున్న మొక్కలు నాటకపోయినప్పటికీ లక్ష్యాలకు సమీపంలో ఉన్నట్లు చూపిస్తున్నారు. గ్రామాల్లో ప్రతీ ఇంటికి ఆరు మొక్కల పంపిణీని కూడా అంతంత మాత్రంగానే చేశారు. ఇప్పటికే సెప్టెంబర్ మాసం సగం గడిచిపోవడంతో ఈ ఏడాది నిర్దేశించిన లక్ష్యాలు చేరుకునే అవకాశాలు కనిపించడం లేదు. రంగారెడ్డి జిల్లాలో 89.32లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 52.61శాతం మాత్రమే పూర్తయ్యింది. అలాగే వికారాబాద్‌లో 71.97శాతం పూర్తి కాగా, మేడ్చల్‌లో కనీస స్థాయిలో కూడా ఈ కార్యక్రమం సాగలేదు. ఇక్కడ కేవలం 28.04శాతం మాత్రమే మొక్కలు నాటడంతో ఈ ఏడాది 50శాతం కూడా లక్ష్యం చేరుకునే అవకాశాలు కనిపించడం లేదు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

» రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్



డాక్టర్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేదలకు మెరుగైన వైద్యం అందించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. రాజేంద్రనగర్ మండలం శివరాంపల్లిలో గురువారం ఆయన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసినట్లు చెప్పారు. సరూర్‌నగర్ యూపీహెచ్‌సీ డాక్టర్‌గా తడకంటి శృతి, రాజేంద్రనగర్ మండలం పాండు రంగానగర్ యూపీహెచ్‌సీ డాక్టర్‌గా డి. స్వేత, అబ్దుల్లాపూర్‌మెట్ యూపీహెచ్‌సీ డాక్టర్‌గా కె.శ్రీనివాస్, మీర్‌పేట్ యూపీహెచ్‌సీ డాక్టర్‌గా అఖేల శ్రీనిధి, ఉప్పర్‌పల్లి యూపీహెచ్‌సీ డాక్టర్‌గా హస్నా పాతీమా, శేరిలింగంపల్లి యూపీహెచ్‌సీ డాక్టర్‌గా ఎండీ ఆవైస్‌కు నియామకపత్రాలను అందించారు. కాంట్రాక్టు పద్ధతిలో ఏడాది కాలపరిమితికి రూ.52 వేల జీతంతో డాక్టర్లు విధులు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. వారం రోజుల్లో విధుల్లో చేరాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అడ్మినిస్ట్రేషన్ అధికారి మహమ్మద్ షఫియోద్దీన్, జిల్లా ప్రోగ్రాం అధికారి అక్రం, సీనియర్ అసిస్టెంట్ మల్లిఖార్జున్ తదితరులున్నారు.

ఎబ్బనూర్ నకిలీ ఓటర్లపై విచారణ

ధారూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎబ్బనూర్ గ్రామంలో నకిలీ ఓట్లు ఉన్నాయని అందిన ఫిర్యాదుపై డీఆర్‌వో రెండు రోజుల పాటు విచారణ జరిపారు. ఓటరు జాబితాలో 52 మంది ఓటర్లు స్థానికంగా లేరని, దొంగ ఓటర్లు ఉన్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నకిలీ ఓటర్లకు నోటీసులు ఇచ్చి విచారణకు హాజరు కావాలని కోరగా రెండు వారాలు గడువు కోరారని తహసీల్దార్ సాజిదా బేగం తెలిపారు. గురువారం డీఆర్‌వో మంగీలాల్ గురువారం జరిపిన విచారణకు 26 మంది హాజరుకాగా, ఇందులో 22 మంది నకిలీ ఓటర్లు ఉన్నట్లు విచారణలో తేలిందన్నారు. మిగతా నలుగురు తమ ఓట్లు ఎబ్బనూర్‌లోనే ఉన్నాయని వాదించారని, వీరి ఓట్లు తాండూర్ ఓటరు జాబితాలో ఉన్నట్లు అనుమానం ఉందని,విచారణ జరుపుతామని పేర్కొన్నారు.

పట్నంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నంలోని పలు సంక్షేమ వసతి గృహాలను గురువారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేశారు. చెర్లపటేల్‌గూడ వద్ద మహాత్మా జ్యోతిరావుపూలే బాలికల రెసిడెన్షియల్, తట్టిఖానా రోడ్డులో ఉన్న గిరిజన సంక్షేమ బాలుర జూనియర్ కళాశాల వసతి గృహాల్లో తనిఖీలు చేపట్టారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజన వడ్డిస్తున్నారా, లేదా అని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఫుడ్ సేఫ్టీ అధికారి, అడిషనల్ ఎస్సీ సూర్యనారాయణ, డీసీఎస్‌వో వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్లు రామకృష్ణ, రవీందర్ నాయక్ ఉన్నారు.

పెండింగ్ వేతనాలను మంజూరు చేయాలి

కందుకూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలతోపాటు పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే మంజూరు చేయాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్, సీఐటీయూ మండల కార్యదర్శి బి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉపాధి కూలీలు, పంచాయతీ కార్మికులతో కలిసి ధర్నా చేశారు. అనంతరం ఎంపీడీవో సరితకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి జగన్, మండల కార్యదర్శి అంకగళ్ల కుమార్, నాయకులు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి

మంచాల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలని, దీంతో దిగుబడి పెరుగుతుందని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ స్వర్ణలత అన్నారు. గురువారం మంచాల మండల కేంద్రంలో వారందించిన కేఎన్ఎం 1638 రకం వరి విత్తనాలతో సాగు చేసిన పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట తర్వాత ధాన్యాన్ని మళ్లీ విత్తనంగా వాడుకోవాలని సూచించారు. విత్తనాలు తయారు చేసి ఇతరులకు విక్రయించి లాభాలు పొందాలన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రీలత, ఏఈవో లింగస్వామి, రైతులు రవీందర్‌రెడ్డి, పాండయ్య, యాదయ్య తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి

చేవెళ్ల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడిని సాధించవచ్చని శాస్త్రవేత్త డాక్టర్ సుజాత అన్నారు. గురువారం మండల పరిధిలోని కుమ్మెర, రావులపల్లి గ్రామాల్లో వరి పైరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి రైతుకు నాణ్యమైన విత్తనాలు అందించాలనే ఉద్దేశంతో క్యూఎస్‌ఈవీ కార్యక్రమం కింద జూన్‌లో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సౌజన్యంతో రైతులకు వరి, జొన్న, కంది విత్తనాలను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో బాలకోటేశ్వర్‌రావు, రైతులు ఉన్నారు.

జాతీయ స్థాయి క్రీడాకారులుగా రాణించాలి

» షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ రూరల్/షాద్‌నగర్, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయిలో రాణించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చెర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. కిషన్‌నగర్ శివారులోని పాఠశాలలో నిర్వహిస్తున్న అండర్ - 14, 17 స్కూల్ గేమ్స్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు దృఢంగా ఉంటారని, వారిలోని ప్రతిభను వెలికి తీస్తే అద్భుతమైన క్రీడాకారులుగా రాణిస్తారని తెలిపారు. ప్రస్తుతం జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగిన వారు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వారేనని పేర్కొన్నారు. క్రీడలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, ఎంఈఓ మనోహర్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, వాడ్యాల నర్సింహారెడ్డి, ప్రిన్సిపాల్ భువనేశ్వర్ దాక్షాయిని, అశోక్, జోనల్ సెక్రెటరీ బాలయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి, జగదీష్, లక్ష్మణ్, అనిత, సంగీత, శ్రీలత, రవి కుమార్, సుజాత ఉన్నారు. అలాగే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 48 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే వీర్లపల్లి రూ.14.6 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజ్ గౌడ్, తిరుపతిరెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గురుకులంలో పూల పండుగ



బతుకమ్మ ఆడుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

శామీర్‌పేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఇశ్రత్ ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థినులు రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. వేడుకల్లో అధ్యాపకురాలు, కల్చరర్ కోఆర్డినేటర్ ధనవేణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చేతన, అకాడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ స్రవంతి పాల్గొన్నారు.

9వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

ఘట్‌కేసర్, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి):ఘట్‌కేసర్ సహకార సంఘంలో రుణాలు పొందిన రైతులకు రుణమాఫీని అమలు చేయాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 9వ రోజుకు చేరుకున్నాయి. గురువారం నాటి దీక్షలలో మహిళలు కూర్చున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు రూ. 2లక్షల వరకు రుణమాఫీ చేసిన ప్రభుత్వం ఘట్‌కేసర్ సహకార సంఘంలో రుణాలు పొందిన వారికి మాత్రం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులందరికి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా స్థానిక బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఘట్‌కేసర్‌లోని గాంధీ విగ్రహంకు వినతిపత్రం ఇంచి నిరసన వ్యక్తం చేశారు.

విద్య, వైద్యానికి పెద్దపీట

» పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేసిందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. టీఆర్ఆర్ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో పరిగి ప్రభుత్వ వైద్యశాలలో గురువారం మహిళలకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పరిగి ఆస్పత్రిని రూ.27 కోట్లతో వంద పడకల ఆస్పత్రిగా మారుస్తున్నట్లు తెలిపారు. అలాగే పరిగి మినీ స్టేడియంలో అండర్-14, అండర్-17 బాల, బాలికల కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ డీఎంహెచ్ఎంలు సిద్ధాంతి ప్రవీణ్‌కుమార్, రవీంద్రయాదవ్, పరిగి సూపరిండెంట్ రాజశేఖర్, పరిగి, కులకచర్ల ఏఎంసీ చైర్మన్లు పరశురాం రెడ్డి, బీఎస్ ఆంజనేయులు, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణప్రసాద్, కార్యదర్శి కె.హన్మంత్‌ముదిరాజ్, పార్టీ దోమ, పూడూరు మండలాల అధ్యక్షులు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

'పాంబండ'ను పర్యాటక కేంద్రంగా మారుస్తాం


కులకచర్ల: కులకచర్ల మండలంలోని పాంబండ ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా మారుస్తామని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ టూరిజం ఈడీ ఉపేంద రెడ్డితో కలిసి ఆలయంలో శ్రీ రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, ఆలయ చైర్మన్ మైపాల్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, జంగయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు భరత్‌రెడ్డి, ఎల్లప్ప ఉన్నారు.

అక్రమ బదిలీలను నిలిపివేయాలి

» సేవ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి

యాచారం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇతర జిల్లాల నుంచి రంగారెడ్డి జిల్లాకు నియమించిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు పంపించాలని సేవ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం యాచారం మండలంలోని కొత్తపల్లి, తక్కళ్లపల్లి, తమ్మలోనిగూడ, మాల్‌మార్కెట్, నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి తదితర గ్రామాల్లో ఆ సంఘం సభ్యత్వ నమోదును ప్రారంభించారు. 317 జీవో ద్వారా జిల్లాలోకి క్యాడర్ సామర్థ్యానికి మించి ఇతర జిల్లాల నుంచి రంగారెడ్డికి కేటాయించారన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులను అ మలు కోసం పోరాటం చేస్తామన్నారు. ఉపాధ్యాయుల హక్కులకు భంగం కలగకుండా బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి ఉన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



చంద్రయ్య (ఫైల్)

షాబాద్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఉబ్బగుంట గ్రామానికి చెందిన బుడ్డమోళ్ల చంద్రయ్య (60) రోజు మాదిరిగానే ఉదయం 6 గంటలకు పొలానికి వెళ్లాడు. పంటకు నీరు పెడదామని మోటర్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలాడు. అది గమనించిన అతని కుమారుడు రాజు ఫోన్ చేసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. 108లో చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చంద్రయ్య మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తమ్ముడు బుడ్డమోళ్ల దశరథ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పీఆర్‌సీని అమలు చేయాలి

చేవెళ్ల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పీఆర్‌సీని అమలు చేసి, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటప్ప డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా మాట్లాడుతూ.. ఎన్నికల మెనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలన్నారు. 30 నుంచి 40 ఏళ్ల సర్వీస్ చేసిన ఉద్యోగికి రిటైర్ అయిన తర్వాత పెన్షన్ లేకపోవడం అన్యాయం అన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి అక్బర్, సభ్యులు కిరణ్, మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, నర్సింహులు ఉన్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం

కందుకూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): క్రీడలకు సీఎం రేవంత్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి డాక్టర్ రాంచంద్రుడు అన్నారు. గురువారం ఆయన మండలంలోని నేదునూరు ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. విద్యతోపాటు అన్ని ఆసక్తి ఉన్న అన్ని రకాల క్రీడల్లో విద్యార్థులు పాల్గొనేలా చూడాలని సూచించారు. మండల స్థాయి, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేలా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు విజయమోహన్, ఉపాధ్యాయులు గ్లోరి, శ్రీవాణి, గిరి, డాక్టర్ ఎండీ బషీర్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం తంటాలు



యాచారం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు వారం రోజులుగా మిషన్‌భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు గోస పడుతున్నారు. తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గాండ్లగూడ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారని తెలిపారు. గురువారం గాండ్లగూడ గ్రామానికి వాటర్ ట్యాంకు రావడంతో జనం నీరు పట్టుకునేందుకు ఎగపడ్డారు. ఉదయం ఒక్క పూట మాత్రమే ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేయడంతో ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు చెప్పారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

» డీపీవో సురేశ్‌మోహన్



ధన్నారంలో డీపీవో సురేశ్‌మోహన్

కందుకూరు,సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇందుకోసం పంచాయతీ కార్మికులకు సహకరించాలని డీపీవో సురేశ్‌మోహన్ అన్నారు. గురువారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో మండలంలోని 35 గ్రామ పంచాయతీలలో చేపట్టిన పిచ్చి మొక్కల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు ధన్నారం గ్రామాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాలలో పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని, డ్రైనేజీ వ్యవస్థను శుభ్రం చేయాలని కార్మికులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరిత, ఎంపీవో గీత, పంచాయతీ కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్

CUB TRUST AND EXCELLENCE SINCE 1904

క్రెడిట్ రికవరీ మరియు మేనేజిమెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001. ఇ-మెయిల్ ID: crmd@cityunionbank.in
ఫోన్ : 0435-2432322. ఫ్యాక్స్ : 0435-2431746

SARFAESI చట్టం 2002 క్రింద రీ-టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన

రుణగ్రహీతలు/హామీదారులు నం. 1) మెస్సర్స్ ఎమ్.ఏ. ఎర్త్ మూవర్స్ అండ్ ట్రాన్స్‌పోర్టర్స్, ప్లాట్ నం.188, రోడ్ నం.5, రాజరాజేశ్వరి నగర్, ఓల్డ్ బోయిన్‌పల్లి, సికింద్రాబాద్, రంగారెడ్డి జిల్లా-500055 మరియు మెస్సర్స్ ఎమ్.ఏ. ఎర్త్ మూవర్స్ అండ్ ట్రాన్స్‌పోర్టర్స్, హుమ్నాబాద్ రింగ్ రోడ్ సర్కిల్, ఎమ్ఆర్ఎల్ కాంప్లెక్స్, కాప్నూర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఫేజ్-2 సమీపమున, కాలాబురాగి-585105. నం.2) శ్రీ ఎమ్‌డి మతీన్, తండ్రి శ్రీ ఎమ్‌డి మలంగ్, జి-3, ఇ.నం.1-52/బి/జి-3, లోటస్, బి-బ్లాక్, ఏసియన్ గార్డెనియా, సిటిఎస్ నం.922/4, షీట్ నం.148, బ్లాక్ నం.4, ఎస్‌పి ఆఫీస్ రోడ్, ఉమెన్స్ కాలేజీ హాస్టల్ దగ్గర, స్టేషన్ వార్డ్, బ్రాహ్మపూర్, గుల్బర్గా-585102. నం.3) శ్రీమతి అయేషా బాను, భర్త శ్రీ ఎమ్‌డి మతీన్, జి-3, ఇ.నం.1-52/బి/జి-3, లోటస్, బి-బ్లాక్, ఏసియన్ గార్డెనియా, సిటిఎస్ నం.922/4, షీట్ నం.148, బ్లాక్ నం.6, ఎస్‌పి ఆఫీస్ రోడ్, ఉమెన్స్ కాలేజీ హాస్టల్ దగ్గర, స్టేషన్ వార్డ్, బ్రాహ్మపూర్, గుల్బర్గా-585102 వారి నుండి 13.06.2025 నుండి చార్జి చేయబడే తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు, బకాయితో కలిపి 12.06.2025 నాటికి రూ.1,47,91,636/- (రూపాయలు ఒక కోటి నలభై ఏడు లక్షల తొంభై ఒక్క వేల ఆరు వందల ముప్పై ఆరు మాత్రమే)లను రాబట్టుకొనుటకు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002లోని రూలు 8(6) & 9 క్రింద, SARFAESI చట్టం 2002, క్రింద, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు తనఖాపెట్టిన దిగువ అస్తి / అస్తులు బ్యాంక్ అధీకృత అధికారిచే రీ-టెండరు-సహిత-బహిరంగ వేలంలో విక్రయించబడును.

మా బ్యాంక్‌కు తనఖా పెట్టబడిన స్థిరాస్తులు
షెడ్యూల్ - ఏ (శ్రీ ఎమ్.డి. మతీన్, తండ్రి శ్రీ ఎమ్‌డి. మలాంగ్‌కు చెందిన అస్తి)

బి-బ్లాక్ అనగా లోటస్‌గా పిలువబడే ఫ్లాట్‌లో సదరు భవనంలో మరియు ఏషియన్ గార్డియానా అవరణలో గుల్బర్గా, స్టేషన్ వార్డు, ఉమెన్స్ హాస్టల్ సమీపాన, ఎస్.పి. ఆఫీస్ రోడ్డు వద్ద గల బ్లాక్-6, షీట్ నం.148, సిటిఎస్ నం.922/4 (భాగం) గల యుటిలిటీ, బాల్కనీ వగైరాతో డ్రాయింగ్ రూమ్, లివింగ్/డైనింగ్, కిచెన్, రెండు బెడ్ రూమ్‌లు దబ్బుసి మరియు బాత్రూం గల గ్రౌండ్ ఫ్లోర్‌పై సూపర్ బిల్టప్ ఏరియా, 1205 చ.అ. విస్తీర్ణ కార్పొరేషన్ ఇ.నం.1-52/బి/జి-3గల నివాసిత ఫ్లాట్ యావత్తు. సరిహద్దులు: ఉత్తరం: డక్ట్, ఏషియన్ గార్డియానా ఉమ్మడిగోడ మరియు దాని తరువాత ఫ్లాట్ ఇ.నం.1-52/బి/జి-4, దక్షిణం: ఏషియన్ గార్డియానా ఖాళీప్రదేశం మరియు దాని తరువాత ఏషియన్ లైఫ్ స్టైల్ యొక్క అస్తి సిటిఎస్ నం.922/5, తూర్పు: ఏషియన్ గార్డియానా ఉమ్మడి గోడ, లిఫ్ట్ రూం మరియు కామన్ లాబీ, 10 అ.వెడల్పు లాబీ, మరియు దాని తరువాత ఫ్లాట్ నం.జి-2, భవనం-లోటస్ (బ్లాక్-బి) ఏషియన్ గార్డియానా ఖాళీ ప్రదేశంతో, పశ్చిమం: ఏషియన్ గార్డియానాతో ఉమ్మడి గోడ, ఏషియాన్ గార్డియానా ఖాళీ ప్రదేశం మరియు దాని తారువాత బిల్డింగ్ తులిప్ (బ్లాక్-ఏ).

రిజర్వు ధర: రూ. 34,00,000/-
(రూపాయలు ముప్పై నాలుగు లక్షలు మాత్రమే)

రీ-వేలం వివరాలు	
రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం తేది :	ప్రదేశం
13-10-2025	సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, హైదరాబాద్ - బాలానగర్ శాఖ, డి.నం.6-3-134/1, ఫ్లాట్ నం.21, ఎఎల్ అమీన్ ప్లాజా, బాలానగర్ మేయిన్ రోడ్, బాలానగర్, రంగారెడ్డి, తెలంగాణ-500037. టెలిఫోన్ నం.: 040-23871407, సెల్ నం.9391521407

రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు :
1. కాగోరు బిడ్డర్లు వేలంలో స్వయంగా పాల్గొనవలెను మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు అందుకు సంబంధించి అతని/ఆమె కొరకే అతను/ఆమె బిడ్డింగ్ వేస్తున్నట్లు వ్రాతపూర్వక ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. 2. కాగోరు బిడ్డర్లు ది మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, హైదరాబాద్ - బాలానగర్ శాఖ, డి.నం.6-3-134/1, ఫ్లాట్ నం.21, ఎఎల్ అమీన్ ప్లాజా, బాలానగర్ మేయిన్ రోడ్, బాలానగర్, రంగారెడ్డి, తెలంగాణ-500037 వారి నుండి టెండరు ఫారాలను పొందవచ్చును. 3. కాగోరు బిడ్డర్లు వారి బిడ్డను "సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్" పేరున తీసిన రిజర్వు ధరలో 10 శాతం బయానా కొరకు డిమాండ్ డ్రాఫ్ట్ / పే ఆర్డర్ రూపంలో ఉన్నదానితోపాటుగా ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.12.00 గం.కు లేదా అలోగా అధీకృత అధికారి, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ వారి చిరునామాకు సీల్డు ఎన్వలప్‌లో నిర్దిష్టపరిచిన టెండరు ఫారంలో మాత్రమే వారి బిడ్డను దాఖలు చేయవలెను. 4. అస్తి తనిఖీ మరియు ఇతర వివరాల కొరకు కాగోరు కొనుగోలుదారు టెలిఫోన్ నం.: 040-23871407, సెల్ నం.9391521407 లను సంప్రదించవచ్చును. 5. అస్తి / అస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా", "అక్కడ ఏది ఉన్నదో అది" మరియు "ఏది ఎక్కడ ఉంటే అదే" ప్రాతిపదికన విక్రయించబడతాయి. 6. ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.01.00 గం.కు కాగోరు బిడ్డర్ల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరవబడతాయి. అమ్మకం సాధారణంగా ముగింపు టెండర్ల రూపంలోనే ఉంటుంది. అధీకృత అధికారి అతని విచక్షణ మేరకు టెండరు ప్రక్రియ ముగింపు సమయంలో స్వీకరించబడిన దానికన్నా అత్యధిక బిడ్‌ను కోట్ చేయుటకు అసక్తి వ్యక్తం చేసిన బిడ్డర్ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చును మరియు అటువంటి సందర్భంలో అత్యధిక బిడ్ వేసిన వ్యక్తికే అమ్మకం సంక్రమిస్తుంది. అయితే అమ్మకం సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. 7. గెలుపొందిన బిడ్డరు అమ్మకం పూర్తయిన వెంటనే అమ్మకం మొత్తంలో 25% (చెల్లించిన బయానా కలిపి) చెల్లించాలి మరియు మిగిలిన 75% మొత్తమును అమ్మకం నిర్ధారణ తేదీ నుండి 15 రోజులలోగా చెల్లించాలి. లేనిచో ముందుగా డిపాజిట్ చేసిన 25% మొత్తం స్వాధీనం చేసుకొనబడుతుంది. 8. ఇందులో నిర్దిష్టపరచిన కాలపరిమితిలోగా మొత్తం అమ్మకం ప్రతిఫలం అందుకున్న తరువాత మాత్రమే గెలుపొందిన కొనుగోలుదారు పేరు మీద అమ్మకం సర్టిఫికెట్‌ను అధీకృత అధికారి జారీ చేస్తారు. 9. చట్టం క్రింద వర్తించు విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు వంటి కన్వేయన్స్ కొరకు చెల్లించాల్సిన చార్జీలు/ఫీజులు గెలుపొందిన కొనుగోలుదారు భరించవలసి ఉంటుంది. 10. ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు మరియు స్థానిక సంస్థలకు బకాయిలు ఉన్న ఏవేని చట్టబద్ధ బకాయిలు (న్యాయపరంగా ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు మరియు ఇతర బకాయిలు) TDS, GST గెలుపొందిన బిడ్డరే చెల్లించాలి. 11. ఎటువంటి కారణం తెలియజేయకుండా బిడ్డను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా అమ్మకాన్ని వాయిదా వేయు లేదా రద్దు చేయు అన్ని అధికారాలు అధీకృత అధికారి కలిగి ఉన్నారు.

ప్రదేశం : కుంబకోణం, తేది : 17-09-2025 అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN - L65110TN1904PLC001287, టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com



బతుకమ్మ సంబురాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు

ముందస్తు బతుకమ్మ సంబురాలు

చేవెళ్ల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్త్రీత్వానికి ప్రతీక బతుకమ్మ అని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత అన్నారు. ఈమేరకు గురువారం చేవెళ్లలోని కళాశాలలో తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులు కవిత, తదితరులు ఉన్నారు.

చచ్చినా కష్టాలే..!

(ఐదోపేజీ తరువాయి)

మోటర్ బిగించలేదు. కొన్ని శ్మశానవాటికల్లో సింథటిక్ ట్యాంకులు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. అలాగే ముళ్లకంప, పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. విద్యుత్ సరఫరా కూడా లేదు. ఏ ఒక్క శ్మశాన వాటికకు ప్రహరీ లేదు. ఇటీవల కుర్మిద్దలో శ్మశానవాటిక నిర్మాణం కోసం రూ.15లక్షల వ్యయంతో పనులకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శంకుస్థాపన చేసి 25 రోజులు దాటినా నేటికీ పనులు ప్రారంభం కాలేదు. రోడ్డు పక్కనే ఉండడంతో పాఠశాలకు వచ్చిపోయే విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. చింతపట్లలో గ్రామానికి కిలోమీటర్ న్నర దూరంలో శ్మశాన వాటిక ఏర్పాటు చేయడంతో గ్రామస్థులు ఇబ్బందుల పాలవుతున్నారు. అక్కడ నీటి వసతి లేక వ్యవసాయ బావుల వద్ద స్నానాలు చేయాల్సి వస్తుందని తెలిపారు.

అనుబంధ గ్రామాల్లో దయనీయం

మండలంలోని పంచాయతీల అనుబంధ గ్రామాల్లో శ్మశాన వాటికలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాషమోనిగూడ, మంగలి గడ్డతండా, మర్లకుంటతండా, పిల్లిపల్లి, గొల్లగూడ, బొల్లిగుట్టతండా, ఇందిరానగర్, ఎర్రగొల్లతండా, నక్కగుట్టతండా, ఏనెకిందితండా, వేపపురి తండా, కొత్తపల్లితండా, కొత్తపల్లితండా, ఇందిరానగర్. మంతన్‌గౌడ్,శ్రీ మంతగూడ, బాషమోనిగూ డ, భానుతండా, నీలిపోచమ్మతండా, ఇందిరానగర్, నల్లవెల్లితండా, గాండ్లగూడ, మొగ్గుళ్లవంపు. కొమ్మోనిబాయి నల్లవెల్లితండాలలో శ్మశానవాటికలు లేవు. ఆ గ్రామాల్లో ఎవరైనా మృతి చెందితే పంటపొలాల్లో ఖననం చేయాల్సిన పరిస్థితి నెలకొంది.



ముళ్లకంప చెట్లతో చిన్నతూండ్ల శ్మశాన వాటిక

క్రైం కార్నర్

జ్యూస్ తాగుతూ కుప్పకూలిన యువకుడు..

గుండెపోటుతో మృతి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జ్యూస్ తాగుతుండగా ఓ యువకుడు గుండెపోటుకు గురై మృతిచెందిన ఘటన గురువారం ఇబ్రహీంపట్నంలో చోటుచేసుకుంది. ఖమ్మం జిల్లా పల్లెపాడుకు చెందిన భద్రయ్య కుమారుడు ఏకలవ్య(30) మూడున్నరేళ్ల క్రితం ఉద్యోగం కోసమని లండన్ వెళ్లాడు. అక్కడ ఉద్యోగం పోవడంతో రెండేళ్ల క్రితం ఇండియా తిరిగి వచ్చాడు. తల్లిదండ్రులకు విషయం చెపితే బాధపడతారనే ఉద్దేశంతో ఇబ్రహీంపట్నంలో ఉంటున్న స్నేహితుడు ఆకాష్ పటేల్ దగ్గరే ఉంటున్నాడు. ఈక్రమంలో గురువారం అతడు జ్యూస్ బండి వద్ద జ్యూస్ తాగుతూ ఒక్కసారిగా గుండెపోటుకు గురై కుప్పకూలడంతో స్థానికులు సీపీఆర్‌చేసి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈమేరకు పోలీసులు తల్లిదండ్రులకు సమాచారమిచ్చి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించారు.

గుర్తుతెలియని మహిళ..



శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలంలోని గగన్‌పహాడ్ వద్ద బుధవారం అపస్మారక స్థితిలో ఓ మహిళ పడి ఉన్న సంఘటన చోటుచేసుకుంది. పెట్రోలింగ్ పోలీసులు ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మహిళ పేరు లక్ష్మి, వయస్సు 40 ఉంటుందని తెలిపారు. మృతిచెందిన మహిళను ఎవరైనా గుర్తుపడితే ఆర్‌జీఏ పోలీసులను 9490617305, 7396266156 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

శంకర్‌పల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం మేరకు.. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని బుల్కాపూర్‌కు చెందిన లక్ష్మయ్య(50)పూల దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగించేవాడు. అయితే బుధవారం రాత్రి లక్ష్మయ్య శంకర్‌పల్లి చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా పటాన్‌చెరు నుంచి శంకర్‌పల్లి మీదుగా చేవెళ్ల వెళ్తున్న లారీ ఢీకొన్నది. లక్ష్మయ్యకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

వ్యక్తి మృతికి కారణమైన నిందితుల రిమాండ్

శంకర్‌పల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): చట్నీ విషయంలో జరిగిన గొడవ ఓ వ్యక్తి మృతికి కారణమైంది. మృతికి కారణమైన ఐదుగురు వ్యక్తులను శంకర్‌పల్లి పోలీసులు గురువారం రిమాండుకు తరలించారు. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం మేరకు.. ఈనెల 9న ఉదయం పూట శంకర్‌పల్లిలోని వేణు హోటల్‌కు వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం మారేపల్లి తండాకు చెందిన నేనావత్ లక్ష్మీబాయి, బుజ్జి, సంతోష్‌లు టిఫిన్ చేసేందుకని వచ్చారు. పూరీ ఆర్డర్ చేసి తింటుండగా చట్నీ విషయంలో గొడవ జరిగింది. టిఫిన్ చేసేందుకు వచ్చిన వారికి హోటల్‌లోని వంట చేసే మాస్టర్లు దిలీప్(19), గౌతమ్(30)లకు బయటి వారు సర్ది చెప్పారు. అయితే, అదేరోజు మధ్యాహ్నం నేనావత్ లక్ష్మీబాయి, బుజ్జి, మలావత్ సంతోష్‌లు అరవింద్, రవిలను హోటల్ వద్దకు వెళ్లి మాస్టర్లతో మరోసారి గొడవపడ్డారు. ఈక్రమంలో దిలీప్‌ను రాయితో, గౌతమ్‌ను కత్తితో గాయపరిచారు. ఇరువురినీ గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ దిలీప్ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతికి కారణమైన నిందితులపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆదిభట్ల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి నుంచి ఒక సెట్టు ప్లేయింగ్ కార్డ్స్, 4 సెల్‌ఫోన్లతో పాటు రూ.18,250 స్వాధీనం చేసుకున్న ఘటన గురువారం రాత్రి ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధి రావిరాలలో వెలుగుచూసింది. గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారమందడంతో పోలీసులు దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

● వందేమాతరం ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి మాధవరెడ్డి



విద్యార్థులతో కలిసి పనులు ప్రారంభిస్తున్న మాధవరెడ్డి

కడ్తాల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే పర్యావరణ పరిరక్షకు కృషి చేస్తూ విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని వందేమాతరం ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎడ్మ మాధవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ, పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమంలో మాధవరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో సీజీఆర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఔషధ మొక్కల తోట, ఇంకుడు గుంత, కంపోస్టు షెడ్డు, కిచెన్ గార్డెన్, మొక్కల పెంపకం కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. అనంతరం పాఠశాల ఆవరణలో గల రావి చెట్టును తల్లి వృక్షంగా ప్రకటించి విద్యార్థులతో కలిసి పూజలు నిర్వహించారు. హెచ్‌ఎం జంగయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాధవరెడ్డి మాట్లాడుతూ మొక్కల పెంపకం ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్లు రాధాకృష్ణారెడ్డి, భీముడు, జనార్ధన్‌రెడ్డి, శ్వేత, ఇంద్రారెడ్డి, కౌసల్య, గీత, స్రవంతి, బుచ్చమ్మ, సునీత, యంగ్ ఎర్త్ లీడర్స్ శష్మంతు, ముజాహిద్, ప్రసాద్, రాఘవేందర్, యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాం జిల్లా కో-ఆర్డినేటర్ రజనీకాంత్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాపై రైతుల ఆగ్రహం



కేశంపేట : రైతులతో మాట్లాడుతున్న జగదీశ్వర్‌గౌడ్

కేశంపేట/మాడ్గుల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో యూరియా అందక పోవడంతో పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. కేశంపేట మండలంలోని కొత్తపేట ప్యాక్స్ సెంటర్ ద్వారా మండల కేంద్రంలో యూరియా సరఫరా చేయాలంటూ రైతులు గురువారం ఆందోళనకు దిగారు. శుక్రవారం గ్రామానికి యూరియా సరఫరా చేస్తున్నారని, అలాగే కేశంపేటలో కూడా సరఫరా చేయాలన్నారు. సమాచారం అందుకున్న ప్యాక్స్ చైర్మన్ గంధ్ర జగదీశ్వర్‌గౌడ్ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని రైతులకు అవసరం మేరకు యూరియా సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం సరిపడా యూరియా సరఫరా చేస్తే ఈ సమస్య వచ్చేది కాదని ఆయన అన్నారు. తమ వంతుగా అధికారులను కలిసి ఎక్కువ మొత్తంలో యూరియా తీసుకరావడానికి ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. అలాగే మాడ్గుల మండలంలోని యూరియా కోసం రైతులు పీఏసీఎస్ కార్యాలయం వద్ద బారులు తీరారు. శుక్రవారం నుంచి ప్రతీ రైతుకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేయాలని ఏవో అరుణకుమారి తెలిపారు.



మాడ్గుల : పీఏసీఎస్‌కు తరలివచ్చిన రైతులు

పదవి లేకున్నా ప్రజాసేవలో ఉంటా



చేవెళ్ల : మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న యాదిరెడ్డి తదితరులు

చేవెళ్ల/కందుకూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాజకీయ జీవితాన్ని ఇచ్చిన చేవెళ్ల ప్రజల రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిదని, పదవి ఉన్నా, లేకున్నా ప్రజాసేవలోనే ఉంటానని, ఈ జీవితం చేవెళ్ల ప్రజలకు అంకితమని మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన పుట్టినరోజు పురస్కరించుకొని డీసీసీ ఉపాధ్యక్షుడు బండారు ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డిల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నగరంలోని ఆయన నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పూల బొకేలిచ్చి కేక్ కట్ చేయించి, శాలువాలతో రంజిత్‌రెడ్డిని సన్మానించారు. స్వీట్లు తినిపించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధి తన కుటుంబం లాంటిదన్నారు. ప్రజలకు ఎప్పుడు ఏ ఆపద వచ్చినా ముందుంటానని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రజాపాలనలో అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, బక్కరెడ్డి యాదిరెడ్డి, రవీందర్‌రెడ్డి, మోసిన్, రవీందర్, చామంతి శివరాజ్, గోపాల్‌రెడ్డి, రాములు, నరేందర్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అలాగే కందుకూరుకు చెందిన మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు రంజిత్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, సొసైటీ చైర్మన్ ఎస్.వెంకట్‌రాంరెడ్డి, మాజీ ఎంపీపీ పల్లా మహేష్‌గౌడ్, మహేశ్వరం ఏఎంసీ డైరెక్టర్లు కె.విష్ణువర్ధన్‌రెడ్డి, బి.ప్రశాంత్‌కుమార్, నాయకులు కె.రాణాప్రతాప్‌రెడ్డి, అందుగుల సత్యనారాయణ, ఎగ్గిడి కృష్ణ, డిల్లీ శ్రీధర్, సరికొండ జగన్, సోలిపేట అమరేందర్‌రెడ్డి, ఎస్.గోపాల్‌రెడ్డి, సింహారెడ్డి, రాంరెడ్డి, ముచ్చర్ల మాజీ సర్పంచ్ ఇ.రాంచంద్రారెడ్డి తదితరులు రంజిత్‌రెడ్డిని కలిశారు.



కందుకూరు : రంజిత్‌రెడ్డిని సన్మానిస్తున్న జంగారెడ్డి

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



షాద్‌నగర్ రూరల్ : పరిసరాలను శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని 15 రోజుల పాటు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఫరూఖ్‌నగర్ మండలం రామేశ్వరం దేవాలయంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు పిట్టల సురేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. చెత్తను చీపుర్లతో ఊడ్చి పారబోశారు. ఆలయ అభివృద్ధితో పాటు సీసీ రోడ్డు, డ్రైనేజీ, పారిశుధ్య పనులు, వీధిలైట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు. అదేవిధంగా ఆలయం వద్ద భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, శ్రీనివాస్, హరిభూషణ్, ప్రశాంత్, గణేష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌తో పరిసరాలు పరిశుభ్రం

కేశంపేట : స్వచ్ఛభారత్ కార్యక్రమంతో పరిసరాలు పరిశుభ్రం చేసుకోవాలని స్వచ్ఛభారత్ షాద్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి పసుల నరసింహ యాదవ్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీజేపీ నాయకులతో కలిసి గురవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి ఆవరణలో చెత్తాచెదారం తొలగించారు. బీజేపీ మండలాధ్యక్షురాలు రాధిక, ప్రధాన కార్యదర్శి తిరుపతి, జిల్లా సాంస్కృతిక విభాగం కో- కన్వీనర్ నరేందర్‌రెడ్డి, యుగంధర్, తలసాని పవన్ కుమార్ రెడ్డి, పాండురంగారెడ్డి, రమేష్, వీరేందర్, మహేష్ తదితరులున్నారు.



కేశంపేట : చెత్తాచెదారం తొలగిస్తున్న నాయకులు



విద్యార్థులకు నోట్‌బుక్‌లు అందించిన సురేశ్

విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ

చౌదరిగూడ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యను ప్రోత్సహించేందుకు నిరంతరం కృషి చేయనున్నట్లు ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు గందె సురేష్ అన్నారు. గురువారం మండల పరిధిలోని తుమ్మలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు సురేష్, మురళి, నారాయణ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

స్వీట్ షాప్ యజమానికి జరిమానా

శంకర్‌పల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని రామంతాపూర్‌లో గల బాలాజీ మిఠాయి దుకాణాన్ని మున్సిపల్ అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగది అపరిశుభ్రంగా ఉండటంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దుకాణ యజమానికి వారు రూ.5వేల అపరాధ రుసుం విధించారు. అనంతరం కమిషనర్ యోగేష్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున హోటళ్లు, మిఠాయి దు కాణాలు, ఛాయ్, టిఫిన్ సెంటర్ల యజమానులు పరిసరాలు, కిచెన్, ఇతరత్రా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తినుబండారాలపై ఈగలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆనంద్, సిబ్బంది ఉన్నారు.

అన్నిరకాల వైద్యసేవలు అందించాలి



చెక్కులు అందిస్తున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్నిరకాల వైద్యసేవలు అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో గురువారం ఆయన పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆహార పదార్థాలను కల్తీచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో పెంచిన మెస్ చార్జీలకనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. మెను ప్రకారం భోజనం అందించాలని, నాణ్యమైన సరుకులు అందించకుంటే కాంట్రాక్ట్‌ను రద్దుచేసి చర్యలు తీసుకుంటామన్నారు. నాయకులు సురమల్ల సుభాష్, సుమన్ నాయక్, శ్రీను నాయక్, శ్రీకాంత్ నాయక్, మణికంఠ, తదితరులు ఉన్నారు.

మంగల్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా

శ్రీశైలం బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీశైలం

ఆదిభట్ల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపల్ గ్రామానికి చెందిన జమ్మ శ్రీశైలం మంగల్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు ఆయనకు డైరెక్టర్లు, సీఈవో మాధవి, కాంగ్రెస్ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేసి సహకార బ్యాంకును అభివృద్ధి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఈసీ శేఖర్ గౌడ్, మహిపాల్, డైరెక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

కొందుర్గు మండల తహసీల్దార్‌గా ఆజం అలీ..

కొందుర్గు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండల నూతన తహసీల్దార్‌గా ఆజం అలీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన రమేష్ కుమార్ ఇటీవల తలకొండపల్లి తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. కేశంపేట మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆజం అలీ గురువారం కొందుర్గు మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ భూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు.

ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ సీఐగా జితేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ సీఐ కె.నరసింహారెడ్డి సైబర్ క్రైంకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పహాడీషరీఫ్ డీఐ సీ.హెచ్ జితేందర్‌రెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆలయ నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామ పంచాయతీ కర్కాస్‌తండాలో ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ చేయూతనందించారు. తండా గిరిజనుల కోరిక మేరకు మెటీరియల్‌ను సమకూర్చారు. గురువారం తండా నాయకులు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవేందర్, శంకర్, రాజు, హన్మంత్, నర్స్య, బుచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మట్టి వేయిస్తున్న అధికారులు

చౌదరిగూడ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షానికి కొత్తగా వేసిన బీటీ రోడ్డు అంచులకు మట్టి కొట్టుకుపోయి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. ఈనెల 15న పొంచి ఉన్న ప్రమాదం అనే కథనం 'ఆంధ్రజ్యోతి' ప్రచురితమైంది. ఈమేరకు అధికారులు గురువారం మండల పరిధి చెగిరెడ్డి ఘణాపూర్ శివారులోని బీటీ రోడ్డు అంచులకు మట్టివేసే పనులు ప్రారంభించారు.

ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల సాకారం

ఆమనగల్లు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల దశాబ్దాల సొంతింటి కల ఇందిరమ్మ ఇళ్ల పథకంతో సాకారం అయిందని డీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, మాజీ వైస్ ఎంపీపీ నిట్ట నారాయణ అన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూర్ చేస్తుందన్నారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ మాడల్ ఇంటిని గురువారం పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు మోడల్ ఇంటిని చూపించాలని అధికారులకు సూచించారు. నిబంధనలకు లోబడి లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను చేపట్టాలన్నారు. ప్రభుత్వం పేదల ఆకాంక్షలకనుగుణంగా పథకాలు రూపొందించి అమలు చేస్తుందని, సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. చేనేత సంఘం మాజీ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, నాయకులు శ్రీనునాయక్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



చెక్కులు అందిస్తున్న రాణి

కేశంపేట సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరంలాంటిదని కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు గుండె రాణి అన్నారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడకు చెందిన అబ్బి మణెమ్మకు రూ. 50వేలు, అబ్రహంకు రూ. 24వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సిఫారసుతో మంజూరయ్యాయి. గురువారం బాధిత కుటుంబ సభ్యులకు ఆమె అందించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అబ్బి సుందరయ్య, కాంగ్రెస్ నాయకులు చెవెళ్ల నర్సింలు, శేఖర్, శంకర్, ఆంజనేయులు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

లంబాడీల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రాజునాయక్

కేశంపేట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నేడు(శుక్రవారం) నిర్వహించే లంబాడీల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని కేశంపేట మండల ఎల్‌హెచ్‌పీఎస్ అధ్యక్షుడు రాజు నాయక్ కోరారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌కు చెందిన తెల్లం వెంకట్రావ్, సోయం బాబురావులు అన్నదమ్ములుగా ఉంటున్న లంబాడ, ఆదివాసులను విడగొట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వారిని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరా పార్క్ వద్ద చేపట్టే సభకు పెద్దఎత్తున లంబాడీలు, బంజారాలు, సుగాలీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. రూప్లానాయక్, జగన్ నాయక్, వీరేందర్ నాయక్, దేవుజా, కిషన్, భాస్కర్ నాయక్, రాజు నాయక్, దశరథ్ నాయక్, చందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం



జీహెచ్‌ఎం శంకర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

చౌదరిగూడ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు పదోన్నతులతో పాటు బదిలీలు తప్పవని జిల్లేడ్ చౌదరిగూడ ఎంఈవో కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని తుమ్మలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గ్రామస్థులు, ఆర్యవైశ్య, ఉపాధ్యాయ సంఘాల సభ్యులు, నాయకులు వీడ్కోలు పొందుతున్న జీహెచ్‌ఎం శంకర్‌ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఇటీవల పాఠశాలలో నూతనంగా ఉద్యోగం పొందిన టీచర్లను సన్మానించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం సునీత, గ్రామస్తులు మాజీ సర్పంచ్ ప్రేమ్‌కుమార్, రాములు, రజాక్, రాంచంద్రయ్య, బాలయ్య, అజ్జు, అర్షద్, సుధాకర్, శేఖర్, బాలమణి, పాపయ్య, రాజు, మాణిక్యరావు, టీచర్లు ఉన్నారు.

బాలాజీసింగ్‌కు నాయకుల పరామర్శ



రతన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యాదిలాల్ తదితరులు

ఆమనగల్లు/మాడ్గుల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధికార ప్రతినిధి, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ తండ్రి రతన్‌సింగ్ ఠాకూర్ మృతి పట్ల ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది యాదిలాల్ సంతాపం తెలిపారు. కల్వకుర్తిలో బాలాజీ సింగ్‌ను ఇంటికెళ్లి పరామర్శించారు. రతన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుడిగా రతన్‌సింగ్ సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. నాయకులు రమేశ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జెల్ల రమేష్‌గౌడ్‌తో పాటు మాడ్గుల కాంగ్రెస్ నాయకులు ఆమనగంటి రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విష్ణు, తదితరులు ఉన్నారు.

మధుయాష్కీని కలిసిన శ్రీనివాస్‌గౌడ్



కడ్తాల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ. గౌడ్‌ను గురువారం టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించారు. ఇటీవల మధుయాష్కీ స్వల్ప అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇంటికి చేరుకొని విశ్రాంతి పొందుతున్నారు. ఈమేరకు శ్రీనివాస్‌గౌడ్ ఆయన్ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.